సాక్షి జోగులాంబ గద్వాల

సోమవారం ౹ 7 ౹ ఏప్రిల్ ౹ 2025



లభించని ఆచూకీ

ఎస్‌ఎల్‌బీసీలో ప్రమాదానికి గురైన కార్మి కుల ఆచూకీ నేటికీ అంతుచిక్కడం లేదు.

వివరాలు 8లో ▸



ఆరోగ్యమే.. ఆనందం

జీవనశైలిలో మార్పులతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.0 /22.6

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

జగమంతా రామమయం

కనుల పండువగా సీతారాముల కల్యాణ మహోత్సవం

- అపర భద్రాద్రి సిర్సనగండ్లలో ఉప్పొంగిన భక్తిపారవశ్యం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



సీతారామచంద్రస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

చారకొండ: ఉమ్మడి పాలమూరు జిల్లాలో అపర భద్రాద్రిగా విరాజిల్లుతున్న సిర్సనగండ్ల క్షేత్రంలో ఆదివారం సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని జగదభిరాముడి కల్యాణ వైభోగాన్ని భక్తజనం కనులారా వీక్షించి భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. ఉదయం 10 గంటలకు వేదమంత్రోచ్ఛరణాలు, మేళతాళాలు, భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా.. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. సీతారామచంద్రస్వామిని పట్టువస్త్రాలతో చూడముచ్చటగా అలంకరించి.. మధ్యాహ్నం 12 గంటలకు జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ ఘట్టాన్ని కనులపండువగా జరిపించారు. రాముడి దోసిట తలంబ్రాలు నీలపు రాసులుగా.. జానకి దోసిట తలంబ్రాలు మణిమాణిక్యాలైన వేళ సిర్సనగండ్ల క్షేత్రం భక్తిపారవశ్యంతో ఉప్పొంగింది. ఈ సందర్భంగా జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి బారులుదీరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిర్సనగండ్ల దేవాలయం అభివృద్ధికి టూరిజం, సాంస్కృతిక శాఖ నుంచి తక్షణమే రూ.2 కోట్లు విడుదల చేస్తామన్నారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మరో రూ.50 కోట్ల మంజూరుకు కృషిచేస్తానన్నారు. దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్యాణ మహోత్సవానికి దాదాపుగా 30 వేల మంది భక్తులు హాజరైనట్లు దేవస్థాన చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు తెలిపారు.



రామయ్య కల్యాణ వేడుకను తిలకిస్తున్న మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

కమనీయం.. సీతారాముల కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా వైభవంగా సాగిన కల్యాణోత్సవాలు
- తరలివచ్చిన భక్తజనం

గద్వాలటౌన్: ఆకాశమంత పెళ్లిపందిరి.. భూలోకమంత కల్యాణ వేదిక.. అష్టదిక్కులా మార్మోగుతున్న మంత్రోచ్ఛరణల నడుమ జగదాభిరాముడు జానకి మెడలో మాంగల్యధారణ చేశారు. అంగరంగ వైభవంగా కోదండరాముని కల్యాణం జరిగింది. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు. అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో, బీచుపల్లిలోని శ్రీ కోదండరామాలయంలో, ధరూర్ పాగుంట లక్ష్మివెంకటేశ్వర స్వామి ఆలయం, మల్దకల్ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం, గద్వాల మండలంలోని చెనుగోనిపల్లి, సంగాల, కొండపల్లి, గోనుపాడు, పరుమాల గ్రామాల్లో కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కోటలోని రామాలయంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని మంత్రాలయ మఠం ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు.

వివిధ పార్టీల నేతల ప్రత్యేక పూజలు.

శ్రీరామనవమి వేడుకలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ తదితరులు వివిధ ఆలయాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్వాల, మల్దకల్, ధరూర్, కేటీదొడ్డి మండలాల్లోని ఆలయాలలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాముడు సుగుణాభిరాముడు, ఆయన జీవితం మానవలోకానికి ఆదర్శమని ఆయన అన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత జిల్లా కేంద్రంలోని ఆలయాలతో పాటు గద్వాల మండలంలో పలు గ్రామాలలో జరిగిన కల్యాణత్సవ ఘట్టానికి ముందు జరిగే పూజా కార్యక్రమాలలో ఆమె శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భారతీయ సమిష్టి కుటుంబంలో పెద్ద కొడుకు, భర్త, అన్న, ప్రభువు, ఎలా ఉండాలో ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నతుడు కోదండరాముడన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుఖశాంతలతో జీవించాలని ఆ కల్యాణరాముడ్ని కోరుకున్నానని చెప్పారు.



గద్వాలలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మార్మోగిన రామనమం..

గద్వాలటౌన్: రామ నామంతో గద్వాల పట్టణ పురవీధులు మార్మోగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సాయంత్రం చేపట్టిన శోభయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్, దర్మ ప్రసార సమితి, బీజేపీ నాయకులతో పాటు ఏబీవీపీ విద్యార్థులు, వివేకానంద సేవాదళ్, హిందూ ధార్మిక సంఘాలతో గద్వాల పట్టణం కాషాయరంగును సంతరించుకుంది. శ్రీరాముని పాటలు, 'జై శ్రీరాం' నినాదాలతో హోరెత్తించారు. బాణసంచా కాలుస్తూ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎస్పీ మొగిలయ్య ఆధ్వర్యంలో యాత్రను ఎప్పటికప్పుడు సీఐ శ్రీనివాస్ బందోబస్తును పర్యవేక్షించారు. ఆరుగురు ఎస్సైలు, 50మంది పోలీసు సిబ్బంది శోభయాత్ర గస్తీలో పాల్గొన్నారు.



గద్వాలలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



గద్వాలలో శోభయాత్రలో పాల్గొన్న ప్రజలు

న్యూస్‌రీల్

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం యథావిధిగా లావాదేవీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో సెలవుల కారణంగా మార్కెట్ బంద్ చేశారు. సోమవారం మధ్యాహ్నం మార్కెట్ కార్యాలయంలో ధాన్యం టెండర్లు వేసి ధరలు నిర్ణయిస్తారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం కావడంతో రైతులు పెద్దఎత్తున వరి ధాన్యం అమ్మకానికి తెస్తున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలోని తమ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్జీవోల కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి పద్మావతికాలనీ, శ్రీనివాసకాలనీలలో ఉంటున్న గృహ, ప్లాట్ల యజమానులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞపి చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు పాలమూరు క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఒడిశా రాష్ట్రంలో మంగళవారం నుంచి శనివారం వరకు జరిగే జాతీయ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. సాయి వివేక్, ఎండీ నవాజ్ తెలంగాణ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరి ఎంపికపై సంఘం సభ్యులు రజనీకాంత్‌రెడ్డి, ఎండీ జియావుద్దీన్, ఎండీ అహ్మద్ హుస్సేన్, కోచ్ ప్రదీప్‌కుమార్, పీఈటీ ప్రణయ్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రామన్‌పాడులో 1,015 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,015 అడుగుల నీటిమట్టం ఉందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల్లో నీటి సరఫరా లేదని.. జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 15 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 52 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

బెట్టింగ్ భూతం..!

ఈజీమనీ ఆశతో రూ.లక్షలకు లక్షలు బెట్టింగ్



- చేసిన అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడితో యువత సతమతం
- జిల్లాలో వారం రోజుల్లో ఇద్దరి బలవన్మరణం

గద్వాల క్రైం: ఈజీగా డబ్బు సంపాదించవచ్చు అన్న యువత అత్యాశను కొన్ని బెట్టింగ్ యాప్ నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. యువతకు మొదట్లో డబ్బు వస్తున్నట్లు ఆశ చూపించి.. బెట్టింగ్ ఊబిలోకి దింపడం.. తీరా రూ.వేల నుంచి రూ.లక్షలు బెట్టింగ్ వేశాక కోరుకోలేని దెబ్బతీస్తున్నారు. అటు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక.. వారి ఒత్తిళ్లు భరించలేక.. కుటుంబసభ్యులకు ఏం చేప్పుకోవాలో తెలియక జిల్లాలో వారం రోజుల్లో ఇద్దరు యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇటీవల ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కావడంతో నడిగడ్డలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు శ్రీకారం చుట్టారు. ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగ్‌లు మొబైల్స్ రాకతో పట్టణ, గ్రామీణం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో పందెం ఆట విడుపుగా మారింది. పందెంలో వేసిన డబ్బులు పోగుట్టుకున్న వారంతా అప్పులు చేసి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

జిల్లాలోని ఘటనలు

⇨ ఈ ఏడాది మార్చి 30న జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు(25) ఆన్‌లైన్‌లో క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు వేస్తు రూ.6లక్షలు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో ఓ కారును తాకట్టు పెట్టి కొంత మేర అప్పు తీర్చాడు. అయినప్పటికీ మిగతా అప్పు చెల్లించాల్సిందిగా ఒత్తిడి తేవడంతో తల్లిదండ్రులను డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరాడు. ఇదే మొదటిసారి కాదు డబ్బులు ఇవ్వడం అంటూ కుటుంబ సభ్యులు మందలించడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. ఈఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

⇨ ఈ నెల 5వ తేదీన గద్వాల మండలానికి చెందిన ఓ యువకుడు(22) ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు వేశాడు. బెట్టింగ్ ఓడిపోవడంతో వారికి డబ్బు చెల్లించేందుకుగాను తెలిసిన వ్యక్తుల ద్వారా రూ.50వేలు అప్పు తీసుకున్నాడు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో వారు మందలించారు. దీంతో కలత చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

⇨ జూన్ 2.2023 జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు క్రికెట్ బెట్టింగ్‌లో రూ. 70లక్షలు పోగొట్టుకున్నాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిడి చేయడంతో అప్పులు చెల్లించే స్తోమత లేకపోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతోపాటు క్రికెట్ బెట్టింగ్‌లో ప్రముఖులు సైతం రూ.కోట్లు పోగొట్టుకున్నారు. కొందరు అప్పులు చెల్లించే దుస్థితి లేకపోవడంతో జిల్లా విడచి పారిపోయారు. ఏజెంట్లపై గద్వాల, శాంతినగర్, రాజోళి, అయిజ, ఉండవెల్లి తదితర పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు.

మాయాజాలం

టీవీలలో క్రికెట్ చూస్తూ టాస్ మొదలుకుని, వికెట్‌ల చొప్పున, బంతి, బంతికి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మ్యాచ్‌లో తలపడే జట్టులో ఫలానా జట్టు టాస్ గెలుస్తుందని, ఫలానా జట్టు బ్యాటింగ్ తీసుకుంటుందని బెట్టింగ్ చేస్తారు. ఈ బెట్టింగ్‌లో ఒకటికి రెండింతలు చెల్లించే పద్ధతిని పాటిస్తారు. మొదటి ఓవర్‌లో వికెట్ పడుతుందని, సిక్సర్ కొడ్తారనే బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. తర్వాతి ఓవర్లలో బంతి, బంతికి... ఫోర్, సిక్సర్ కొడతారని, వికెట్ పడుతుందని, ఎక్స్‌ట్రా రన్ వస్తుందని, రివ్యూ ఛాయిస్ తీసుకుంటారంటూ పలు రకాలుగా బెట్టింగ్‌లు చేస్తారు. ఒక్కో సందర్భంలో బెట్టింగ్‌కు పాల్పడే మొత్తానికి 5 నుంచి 10 రెట్ల వరకు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి



క్రికెట్, ఇతర బెట్టింగ్‌లకు ప్రజలు, ముఖ్యంగా యువత దూరంగా ఉండాలి. ఇలా బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌లో సిబ్బందికి దిశానిర్దేశం చేశాం. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలి. అధికంగా డబ్బు ఖర్చు చేస్తున్నారంటే అనుమానించాల్సిందే. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే సైబర్‌క్రైం వెబ్‌సైట్, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930, డయల్ 100కు ఫిర్యాదు చేయాలి. – శ్రీనివాసరావు, ఎస్పీ

పోలీసుల ప్రత్యేక నిఘా.. రూ.కోట్ల ఆస్తులు సీజ్

జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటి ఎస్పీగా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈక్రమంలో క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచారు. అదే ఏడాది జూలై 13వ తేదిన క్రికెట్ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని జిల్లా మొత్తం జల్లెడపట్టి 120 మంది సభ్యులపై కేసు నమోదు చేసి రూ.4 కోట్ల మేర ఆస్తులను సీజ్ చేశారు. ఈ వ్యవహారంలోనూ అయిజకు చెందిన ప్రముఖ ఏజెంట్‌తో పాటు అంతర్రాష్ట్రానికి చెందిన వ్యక్తులు ఉన్నారు. 2019 ఏప్రిల్ 24వ తేదీన గద్వాల – అయిజకు చెందిన ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని రూ. 4లక్షల 38 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. 2023, 2024లో అడపాదడపా జిల్లాలో కేసులు నమోదవుతున్నాయి. అయినా కూడా పూర్తి స్థాయిలో బెట్టింగ్‌లకు చెక్ పడడంలేదు.

పల్లెపల్లెన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



గద్వాలలో పార్టీ జెండా ఆవిష్కరణలో బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: భారతీయ జనతా పార్టీ బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గతంలో కంటే ఈసారి భిన్నంగా పార్టీ కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని బూత్‌స్థాయిలో పార్టీ జెండాను ఆయా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యకర్తలు సైతం తమ ఇళ్లపై పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ.. త్యాగాల పునాదులపై బీజేపీ ఆవిర్భవించిందని చెప్పారు. ఒకేదేశం, ఒకే ప్రజలు, ఒకే మతం కావాలని కోరిన ఘనత తమ పార్టీదేనని పేర్కొన్నారు. మహనీయుల అవిశ్రాంత సేవ, కృషి ఫలితంగానే జనసంఘ్ నుంచి భారతీయ జనతాపార్టీ ఏర్పడిందని చెప్పారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలు, నయవంచక పాలనపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్సర్‌పాష, డీకే స్నిగ్ధారెడ్డి, బండల వెంకట్రాములు, రవికుమార్‌ఎక్బోటే, బండల పద్మావతి, జయశ్రీ, సంజీవ్ భరద్వాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహా, దేవదాసు, అనిల్, చిత్తారికిరణ్, మమత తదితరులు పాల్గొన్నారు.

పల్లె వనం.. కళావిహీనం

- నీటి సౌకర్యం లేక వాడుతున్న మొక్కలు
- ఆహ్లాదానికి దూరమవుతున్న ప్రజలు
- మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం



మానవపాడులో బృహత్‌పల్లెప్రకృతివనంలో ఎండిన మొక్కలు

మానవపాడు: పల్లె ప్రజలకు ప్రకృతి అందాలు పంచేందుకు దాదాపు రూ.లక్షలు వెచ్చించి పెంచిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేక వృథాగా మారాయి. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని.. ఎన్నో ఔషధ మొక్కలకు నెలవుగా మారాలని.. పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన పల్లె ప్రకృతి వనాలు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోయి.. మందుబాబులకు అడ్డాగా మారాయి. మొత్తంగా పల్లె ప్రకృతి వనాలు కళతప్పాయి. జిల్లాలోని 13 మండలాల్లో 254 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక్కో పల్లె ప్రకృతివనం నిర్మించారు. రెండేళ్ల పాటు ఈజీఎస్, ఆ తర్వాత జీపీలు నిర్వహణ బాధ్యతలు చూశాయి. అయితే, గ్రామాలకు దూరంగా ఉండటం, కొన్ని గ్రామాల్లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం, నీటి సౌకర్యం లేకపోవడం .. వీటికి తోడు వేసవి ఎండలకు మొక్కలు ఎండిపోతున్నాయి. ఊరికి దూరంగా ఉండడంతో రాత్రివేళ్లలో మద్యం బాబులు అడ్డాలుగా వాడుకుంటున్నారు.

మొక్కలను కాపాడతాం

పల్లె ప్రకృతి వనాలను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటాం. నీటి సాదుపాయం అందించేలా చూస్తాం. మొక్కలు ఎండకుండా కాపాడతాం. – నాగేంద్రం, జిల్లా పంచాయతీ అధికారి

నిర్వహణ ముఖ్యం

ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడమే పల్లె ప్రకృతి వనాల ముఖ్య ఉద్దేశం. నిర్వహణ లేకనే లక్ష్యం నీరుగారుతోంది. అధికారులు స్పందించి మొక్కలు ఎండకుండా ప్రతి రోజు నీరందించాలి. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచాలి. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటుచేయాలి.

– విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్, బోరవెల్లి

ఆరోగ్యమే ఆనందం

జిల్లాలో పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు

- 35 నుంచి 50 ఏళ్లలోపు వారే అధికం
- జీవన విధానం, ఆహారంలో మార్పులే కారణం
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

జిల్లాలో ఇలా..

రక్తపోటు బాధితులు	క్యాన్సర్ రోగులు
87,739	188

మధుమేహ వ్యాధిగ్రస్తులు 50,421



పాలమూరు: ఉరుకుల పరుగుల జీవనం.. ఒత్తిళ్లు.. జీవనశైలిలో మార్పులతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు కలవరపెడుతున్నాయి. వ్యాయామం లేకపోవడం, వేళాపాళాలేని భోజనం, పొగతాగడం, ఒత్తిళ్లు హృద్రోగాలకు కారణంగా వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, రక్తపోటు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, స్థూలకాయం, గుండెనొప్పిలాంటి సమస్యలతో జిల్లావాసులు సతమవుతున్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

అధిక రక్తపోటు..

జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారిలో సగటున 20 శాతం మంది అధిక రక్తపోటు బాధితులే. వీరిలో రక్తపోటు 140/90గా గుర్తించారు. మధుమేహ బాధితులు 6.8 శాతం, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారు 11 శాతం ఉన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో చాలామంది స్థూలకాయంతో బాధపడుతున్నారు.

ప్రతి ఐదుగురిలో ఒకరు..

ప్రతి ఐదుగురిలో ఒకరు మధుమేహం వ్యాధిగ్రస్తుడు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. అంటే ప్రస్తుతం జిల్లాలో సుమారు రెండు 2 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. వీరు జీవన శైలి, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. వచ్చే దశాబ్ద కాలంలో 50 శాతం మంది ఈ వ్యాధి బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ శారీరక శ్రమ తగ్గడంతో రకరకాల వ్యాధులు వస్తున్నాయి. ముఖ్యంగా టీవీల ఎదుట గంటల తరబడి కూర్చోవడం సాధారణమైంది. ఆహారం తీసుకోవడంలోనూ పలు మార్పులొచ్చాయి. ఆహారంతో పాటు వాతావారణ మార్పులు, వంశపారంపర్యంగా రక్తపోటు, మధుమేహం రావడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అయోడిన్ దుష్ఫలితాలు..

జీవన క్రియలకు అవసరమైన మూలకాల్లో అయోడిన్ ఒకటి. దీనిలోపంతో గాయిటర్, బుద్ధిమాంద్యం, స్త్రీలల్లో గర్భస్రావం, అలసట, చికాకు, కోపం వంటివి పెరుగుతాయి. అయోడిన్ లోపంతో అవటు గ్రంథి పనితీరు తగ్గుతుంది. ఇది జీవన క్రియల మీద ప్రభావం చూపుతుంది. ఇది తీవ్రమైతే అవటు గ్రంథి పెరుగుతుంది. ఫలితంగా మెడ భాగంలో ఉబ్బెత్తుగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాపాయంగా పరిణమిస్తుంది.

తినకూడనివి	తినదగినవి
మటన్	చికెన్ (స్కిన్‌లెస్)
ఆయిల్‌ఫుడ్	గుడ్డు (తెల్ల సోన)
అధిక ఉప్పు	కూరగాయలు (ఉడకబెట్టినవి)
పచ్చడి	పాలు (ప్యాకెట్‌వి మాత్రమే)
తంబాకు, గుట్కా	
బ్రెడ్, బేకరీ ఫుడ్	

నడకతోనే మెరుగైన ఆరోగ్యం..



నిత్యం నడకతో మెరుగైన ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. శ్వాస ప్రక్రియలో మార్పులు గమనించవచ్చు. రక్తపోటు, మధుమేహం నియంత్రణలోకి వస్తాయి. నడకతో శరీరంలో రక్త ప్రసరణ పెరిగి రక్తపోటు అదుపులోకి వస్తోంది. గుండె జబ్బుల తీవ్రత తగ్గుతుంది. ఇంట్లో వేడిగా తయారు చేసుకున్న ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్, మసాలాలు, ఫ్రై ఆహారం తగ్గించాలి. ప్రతి మూడు నెలలకు ఓసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. మనిషిలో గ్లూకోజ్ స్థాయి పడిపోతుంటే సూచనలు తెలుస్తాయి. వెంటనే ఏదో ఒక ఆహారం తీసుకోవాలి. – డా. శంకర్, జనరల్ ఫిజీషియన్

రక్తపోటు బాధితులు పెరిగారు..



జిల్లాలో రక్తపోటు బాధితులు పెరిగిపోతున్నారు. దీనిని ప్రాథమిక దశలో గుర్తించకపోతే ఇబ్బందే. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నడక, వ్యాయామం అలవాటు చేసుకోవాలి. నిద్ర సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి. – డా. కృష్ణ, జిల్లా వైద్యాధికారి, మహబూబ్‌నగర్

బరువు అదుపులో ఉంచుకోవాలి..



క్రమం తప్పకుండా హార్ట్‌బీట్, కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ చెక్ చేసుకోవాలి. బేకరీ ఫుడ్, బిర్యానీ, మాంసం తక్కువగా తీసుకోవడంతో పాటు బరువు అదుపులో ఉంచుకోవాలి. వారంలో ఐదురోజుల పాటు అరగంట వ్యాయామం చేయాలి. మాసాలతో కూడిన ఆహారం తీసుకోరాదు. మాంసం వారానికి ఒక్కసారి మాత్రమే తినాలి. – డా. మహేష్‌బాబు, హృద్రోగ నిపుణుడు

వైభవం.. రాములోరి కల్యాణం



మన్యంకొండలో అమ్మవారికి మంగళసూత్రధారణ నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

- జనసంద్రమైన మన్యంకొండ
- లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం
- శ్రీరామకొండ క్షేత్రంలో ఘనంగా వేడుకలు
- పాల్గొన్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం దంపతులు
- భక్తులకు అన్నదానాలు
- బీచుపల్లిలో ప్రత్యేకపూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి దంపతులను గర్భగుడి నుంచి దేవస్థానం సమీపంలోని రామసదనం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మహిళల మంగళ హారతులు, సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. ప్రత్యేక పూజల అనంతరం జీలకర్ర, బెల్లం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనావళి తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్చరణలు, సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారి మంగళ సూత్రధారణ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. కల్యాణం అనంతరం స్వామి దంపతులను మళ్లీ పల్లకీలో గర్భగుడి వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మన్యంకొండకు తరలిరాగా జనసంద్రమైంది. రకరకాల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామిదంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, దేవస్థానం చైర్మన్ ఆళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో



బీచుపల్లి ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ వేడుకలను అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, అభిషేకములను నిర్వహించి సీతారాములకు ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేశారు. వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో సీతారాములకు వైభవంగా కల్యాణాన్ని జరిపారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గద్వాల జిల్లా జడ్జి కుష కుటుంబ సమేతంగా రాములోరి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, డీఎస్పీ మొగులయ్య, సిఐ రవిబాబు, అర్చకులు, పాలక మండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



బీచుపల్లి పుణ్యక్షేత్రంలో భక్తులు

కనులపండువగా..



శ్రీరామకొండపై సీతారాముల కల్యాణంలో పాల్గొన్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం దంపతులు

కోయిల్‌కొండ: జిల్లాలో ప్రసిద్ధి చెందిన మహిమన్వితమైన శ్రీరామకొండ క్షేత్రంలో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి దంపతులు, వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని వీక్షించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

లభించని ఆరుగురి ఆచూకీ



సొరంగంలోకి వెళ్తున్న సహాయక సిబ్బంది

ఎస్‌ఎల్‌బీసీలో 44 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదానికి గురైన కార్మికుల ఆచూకీ కోసం 44 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సొరంగం పైకప్పు కూలిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా.. ఇద్దరి మృతదేహాలను వెలికి తీసిన విషయం తెలిసిందే. మిగతా ఆరుగురి ఆచూకీ కోసం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. జీఎస్‌ఐ, నీటిపారుదలశాఖ అధికారులు సొరంగ ప్రదేశం వద్ద ఉంటూ సహాయక సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అయితే సొరంగంలో ఎస్కవేటర్లు, సహాయక సిబ్బంది సేవలే ప్రధానంగా ఉపయోగపడుతున్నాయి. సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్స్, దక్షిణమధ్య రైల్వే, ఆర్మీ, హైడ్రా వంటి 12 రకాల సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. వీటికి తోడు ఐదు ఎస్కవేటర్లతో మట్టి, రాళ్లు, బురద, టీబీఎం భాగాలను తొలగించే పనులను ముమ్మరం చేశారు.



సొరంగంలో టీబీఎం స్టీల్ బాడీని వెలికితీస్తున్న ఎస్కవేటర్

రోజుకు 20 మీటర్ల మట్టి తొలగింపు..

సొరంగం లోపల పైకప్పు కూలిన ప్రదేశంలో రోజు 20 మీటర్ల మేర మట్టిని తొలగిస్తున్నారు. తవ్విన మట్టి, బురద, రాళ్లను కన్వేయర్ బెల్టు ద్వారా, టీబీఎం భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు పంపిస్తున్నారు. సొరంగం కూలిన ప్రదేశంలో సహాయక చర్యలకు ఆటంకంగా మారిన నీటి ఊటను ఎప్పటికప్పుడు బయటకు పంపింగ్ చేస్తున్నారు. నిమిషానికి 10వేల లీటర్ల చొప్పున వస్తున్న నీటి ఊటను 150 హెచ్‌పీ మోటార్ల సహాయంతో తోడేస్తున్నారు.

చురుగ్గా సహాయక చర్యలు..

సహాయక చర్యలను చురుకుగా చేపడుతున్నట్లు ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. ఆదివారం సొరంగం వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి తొలగింపునకు అడ్డుగా ఉన్న టీబీఎం భాగాలను కట్‌చేసి బయటకు తరలిస్తున్నట్లు చెప్పారు. సహాయక సిబ్బందికి కావాల్సిన ఆహారం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

అక్రమంగా ఎర్రమట్టి తరలింపు



ఎర్రగుట్ట వద్ద టిప్పర్లు

చిన్నచింతకుంట: మండలంలోని పల్లమరి గ్రామ సమీపంలోని ఎర్రగుట్ట నుంచి కొందరు ఎలాంటి అనుమతుల్లేకుండా ఎర్రమట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఆదివారం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా అప్పటికే టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్లిపోయాయి. అక్కడే ఉన్న హిటాచీ డ్రైవర్ భరత్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. అక్రమార్కులు పగలు ఎర్రమట్టిని తరలిస్తూ రాత్రి సమయంలో గ్రామ సమీపంలోని ఊక చెట్టు వాగునుంచి ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అకాల వర్షానికి నేలరాలిన మామిడి కాయలు



కల్వకోల్‌లో వర్షానికి నేలరాలిన మామిడి కాయలు

పెద్దకొత్తపల్లి : మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి మామిడి కాయలు నేలరాలినట్లు కౌలురైతులు తెలిపారు. మండలంలో సుమారు 1000 ఎకరాల్లో మామిడి కాయలు నేలపాలయ్యాయి. కల్వకోలు, తీరునాంపలి, చెన్నపురావు పల్లి, జోన్నలబోగుడ, పెద్దకొత్తపల్లి దేవుని తిరుమలాపూర్ ,చంద్రకల్, ముష్టిపల్లి, మరికల్ మామిడి తోటల్లో కాయలు వర్షానికి రాలిపోవడంతో రైతులు నష్టపోయారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కాకర్లపహాడ్‌లో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మరిపల్లి కేశవులు(47) అనే వ్యక్తి శనివారం గ్రామ సమీపంలోని ఉంగరం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు చెరువులో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం అతడు చెరువులో శవమై కనిపించాడు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..



అంజమ్మ(ఫైల్)

ధన్వాడ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గౌడపోళ్ల అంజమ్మ(45) చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మరికల్ మండలానికి చెందిన అంజమ్మ తన కుమారుడితో కలిసి బైక్‌పై వస్తుండగా ధన్వాడలోని మోడల్ పాఠశాల సమీపంలో ఎదురుగా ఇంకో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక అంజమ్మ ఆదివారం సుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిందని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

మురుగు కాల్వలో పడి యువకుడు..



మహేష్(ఫైల్)

కోడేరు: మురుగు కాల్వలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన హరిజన మిద్దె మహేష్(18) ఆదివారం ఉదయం బయటికెళ్తుండగా పక్కన ఉన్న మురుగు కాల్వలో ప్రమాదవశాత్తు కాలుజారి పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లుగా ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని హనుమాన్ నగర్‌లోని ఓ వ్యక్తి ఆదివారం ఇంట్లో పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందింది. తనిఖీలు చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.96,250 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రేమ వ్యవహారం

పాన్‌గల్: ప్రేమ వ్యవహారం పోలీసుస్టేషన్‌కు చేరిన ఘటన ఆదివారం రాత్రి పాన్‌గల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని రేమద్దులకు చెందిన నందిని(22), మహేందర్(29) ఇరువురు రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. అమ్మాయి హైదరాబాదులో ఫామ్–డి చదువుతుండటం, అబ్బాయి డిగ్రీ పూర్తిచేసి గ్రామంలోనే ఉంటున్నాడు. ఇరువురు కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్ళికి అంగీకరించలేదు. శనివారం అమ్మాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇద్దరు మేజర్లు కావడంతో పోలీసులు ఇరు కుటుంబ సభ్యులను, గ్రామ పెద్దలను స్టేషన్‌కు పిలిచి మాట్లాడారు. పోలీసులు, పెద్దల సమక్షంలో వారు పెళ్లికి ఒప్పుకున్నారు. మంచి ముహూర్తం చూసి అందరి సమక్షంలో కొల్లాపూర్ సమీపంలో సింగోటం దేవాలయంలో పెళ్లికి చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

వాతావరణం.. చీడపీడలు



బూజు తెగుళ్లు



నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న సమయాల్లో..

అలంపూర్: వ్యవసాయం.. వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యంగా నేల స్వభావం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. విత్తనం వేసే సమయం నుంచి పంట చేతికి వచ్చే వరకు వాతవరణ ప్రభావం ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆకాల వర్షాలు విపరీతమైన ఎండలు వర్షాభావ పరిస్థితులు వరదలు, తుఫాన్‌లు రావడం సర్వసాధరణమైపోయింది. ఇటువంటి విపత్కర పరిణామాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ రైతులు సూచించారు. వీటిని ముందుగా తెలుసుకోగలిగితే కొంత వరకైనా జాగ్రత్తలు తీసుకొని నష్టాలను తగ్గించే అవకాశం కలుగుతుంది చెబుతున్నారు. వాతవరణాన్ని బట్టి పురుగులు తెగుళ్ల తాకిడిపై ముందస్తు సమాచారం తెలుసుకోని చర్యలు చేపట్టవచ్చు. తుఫాను సమయం మబ్బులు, తేమ వాతవరణం, ఉష్ణోగ్రతలు తగ్గడం వంటివి బూజు తెగుళ్ల ఉధృతికి తోడ్పతాయి. వాతవరణం పొడిగా ఉంటే ఆకు ముడత రసం పీల్చే పురుగుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

పాడి-పంట

అధికారి సలహా: సక్రియానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

వాతావరణ పరిస్థితులు	ఉధృతమయ్యే చీడపీడలు
పగటి ఉష్ణోగ్రత తక్కువ..మేఘావృతమైన ఆకాశం గాలిలో తేమ అధికంగా ఉండి.. పగటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే	లద్దె పురుగు చురుకవుతుంది
ఎక్కువ కాలం పొడి వాతావరణం ఎక్కువ ఉష్ణోగ్రత	పచ్చ దీపపు పురుగులు వృద్ధి చెందుతాయి చెరకు, మిర్చి, జొన్న,
ఎడతెరిపి లేని వర్షాలు పడితే	పత్తిలో రసం పీల్చే పురుగుల్లో ముఖ్యంగా నల్లి
పూతదశలో వెచ్చని వాతావరణం..	వరిలో కాండం తొలిచే పురుగుల
మబ్బులు కమ్మిన ఆకాశం, తరుచు జల్లులు	ఉధృతి తగ్గుతుంది.వరి ఈగ ఉధృతి పెరుగుతుంది.
రాత్రి ఉష్ణోగ్రత 20 డిగ్రీల కంటే తక్కువ,	వరిలో కంప నల్లి
గాలిలో తేమ ఎక్కువ,	.వరిలో పొట్ట కుళ్లు తెగుళ్లు, అగ్గి తెగుళ్లు
చల్లగా ఉండటం, మంచు పడటం.	ఫ్యుజేరియం విల్టు, కూరగాయలు,
నీటి ఎద్దడి ఎక్కువ కాలం ఉంటే..	పత్తి మొదలైన పైర్ల మీద
వర్షాలు ఎక్కువ పడి గాలిలో తేమ ఎక్కువగా ఉంటే..	ఆముదంపై కాయ కుళ్లు, బూజు తెగుళ్లు
సుదీర్ఘమైన బెట్ట, మధ్య మధ్య జల్లులు	పత్తిలో తెల్ల దోమ
వర్షం పడుతున్నప్పుడు, తేమ అధికంగా ఉన్నప్పుడు	పత్తిలో కాయకుళ్లు

విత్తనాల పండుగలో జడ్చర్ల విద్యార్థులు



విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీ మల్లు రవి

జడ్చర్ల టౌన్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన తెలంగాణ విత్తనాల పండుగలో జడ్చర్ల డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 వలంటీర్లు రవీందర్, భరత్ పాల్గొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డా.సదాశివయ్య ఆధ్వర్యంలో 530 రకాల విత్తనాలను ప్రదర్శించారు. మూడు రోజులపాటు జరిగిన విత్తనాల పండుగలో దేశ నలమూలల నుంచి రైతులు, రైతు సంఘాలు, ఇతర సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేయగా.. ప్రభుత్వరంగం నుంచి ఒక జడ్చర్ల డిగ్రీ కళాశాల మాత్రమే పాల్గొనట్లు సదాశివయ్య తెలిపారు. అందరూ పంట మొక్కల విత్తనాలు ప్రదర్శిస్తే.. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గత మూడేళ్ల నుంచి అనేక అటవీ ప్రాంతాల్లో సేకరించిన 530 రకాల విత్తనాలను ప్రదర్శించగా.. సినీ నటుడు నాగినీడు, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి అభినందించారు.

డబ్ల్యూఈపీఎల్‌లో సత్తాచాటాలి



గణేష్‌ను సన్మానించిన ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రికెట్ క్రీడాకారుడు గణేష్ ఇంగ్లాండ్‌లో జరిగే డబ్ల్యూఈపీఎల్ లీగ్‌లో పాల్గొంటుండడం సంతోషంగా ఉందని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. గణేష్‌ను ఆదివారం జిల్లాకేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని ఎండీసీఏ మైదానంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఈపీఎల్) ప్రీమ్ 2 డివిజన్, వరిష్ఠ చెల్టినహమ్ ప్రీమియర్ టీ–20, డబ్ల్యూఈపీఎల్ టీ–20, నేషనల్, కంట్రీకప్ టోర్నమెంట్‌ల్లో ఆరునెలలపాటు గణేష్ ఆడనున్నాడని పేర్కొన్నారు. భవిష్యత్‌లో రంజీ జట్టుకు ఎంపికకావాలని ఆయన ఆకాంక్షించారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, సభ్యులు చంద్రకుమార్‌గౌడ్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు ముఖ్తార్‌అలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రసాద వితరణకు విరాళం



గద్వాలన్యూటౌన్: గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లి రామాలయంలో ఆదివారం రాములోరి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భారతీ సిమెంట్ యాజమాన్యం ప్రసాద వితరణకు రూ.25వేలు విరాళం అందజేశారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భారతీ సిమెంట్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో భారతీ సిమెంట్ మార్కెటింగ్ అధికారి విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ ఏకాంబర్‌రెడ్డి, డీలర్లు రంగస్వామి, శ్రీనివాసులు, వెంకటయ్య, లక్ష్మీరెడ్డి, సవారన్న, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల సబ్‌స్టేషన్ పరిధిలోని మారమునగాల, ప్రాగటూరు, శేరుపల్లే, తక్కశీల, కంచుపాడు, గ్రామాల్లో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శివ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రహరీ నిర్మించాలి



మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ లేక అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకతాయిలు, మద్యం బాబులకు అడ్డాగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు. ప్రహరీ నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వేసవి సెలవుల్లో అయినా కళాశాల చుట్టూ ప్రహరీ చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజలకు సేవలందించడం అదృష్టం



గద్వాలటౌన్: ప్రజలకు సేవ చేయడం అదృష్టమని మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా నివాసంలో పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ.. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలకు సేవలందించే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యకర్తలు తమవంతు బాధ్యతగా గ్రామాల్లో సామాజిక సేవలు అందిస్తూ సమాజ సేవలో పాల్గొనాలని సూచించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



అయిజ: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం మండలంలోని ఈడుగోనిపల్లిలో అంతర్రాష్ట్ర ఓపెన్ మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించారు. దొడ్డెప్ప ముఖ్య అతిథిగా హాజరై క్రీడలు ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 12 జట్లు తలపడనున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

మల్దకల్: మండలంలోని ఎల్కూరు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మండల నాయకులు చక్రధర్‌రెడ్డి, నాగేష్, ప్రాణేష్, రాఘవేంద్రదాసు, ప్రద్యుమ్న పాల్గొన్నారు.



కనులపండువగా రాములోరి కల్యాణం

- గ్రామాల్లో సందడిగా శ్రీరామనవమి వేడుకలు
- పాల్గొన్న నాయకులు, ప్రజలు



తాటికుంటలో రాములోరి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

సాక్షి నెట్‌వర్క్: శ్రీరామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ముత్యాల పందిర్లలో వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ సీతారాముని కల్యాణ వేడుకలు వైభవంగా జరిపించారు. సీతాసమేతుడైనా శ్రీరామచంద్రుడి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయాల వద్ద వడపప్పు పానకం, అన్నప్రసాద వితరణ గావించారు. శ్రీరామచంద్రుని నామ స్మరణతో భక్తులు పారవశ్యం పొందారు.

⇨ ధరూరు మండల పరిధిలోని ఓబులోనిపల్లి గ్రామంలో గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సరిత శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. మార్లబీడులో బీఆర్‌ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు, మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం, నీలహళ్లిలో జరిగిన వేడుకల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తనయుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి వేర్వేరుగా హాజరై పూజలు చేశారు.

⇨ కేటీదొడ్డి మండల కేంద్రంలో సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, మాజీ జెడ్పీటీసీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

⇨ మల్దకల్ మండలంలోని తాటికుంటలో మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి దంపతులు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు.

⇨ అయిజ మండల కేంద్రం, వివిధ గ్రామాల్లో రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించారు.

⇨ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఆలయాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు.

⇨ ఉండవెల్లి మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పుల్లూరు గ్రామంలో కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

⇨ రాజోళి వైకుంఠ నారాయణస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో తలంబ్రాలకు ప్రత్యేక పూజలు చేసి, తుమ్మలపల్లె ఆలయానికి తీసుకొచ్చి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.



పుల్లూరులో కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే విజయుడు

⇨ ఇటిక్యాల పెద్దదిన్నే వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. చిన్నారులు భగవద్గీత శ్లోకాలు, శ్రీరామ వంశవృక్షాన్ని కంఠస్థంగా పఠనం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

⇨ గట్టులోని గండి ఆంజనేయస్వామి దేవాలయంలో కనులపండుగగా సీతారాముల కల్యాణం నిర్వహించారు.

⇨ ఎర్రవల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు వేడుకలను కనులారా తిలకించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాటం, చిన్నారుల నృత్యాల నడుమ కల్యాణం కనులపండువగా సాగింది.



కేటీదొడ్డిలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ఉండవెల్లిలో సీతారాముల కల్యాణంలో భక్తులు



మానవపాడులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



ధరూరు : నీలహళ్లిలో వేడుకలో పాల్గొన్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి



జింకలపల్లిలో రాములోరి ఊరేగింపును నిర్వహిస్తున్న భక్తులు



యాపదిన్నెలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



ఓబులోనిపల్లిలో సీతారాముల కల్యాణంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత



శేషంపల్లిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దాతలు

ఘనంగా తిక్కవీరప్ప రథోత్సవం

కేటీదొడ్డి: మండలంలోని ఇర్కిచేడులో తిక్కవీరప్ప జాతర రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బాసు హనుమంతునాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై రథాన్ని లాగారు. గ్రామంలో గోవింద నామస్మరణ మార్మోగింది. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ మురళి, ఉరుకుందు, వెంకన్‌గౌడు, చక్రధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

దేశ భవిష్యత్ కోసం పుట్టిన పార్టీ బీజేపీ

రాజోళి: దేశ భవిష్యత్ కోసం పుట్టిన పార్టీ బీజేపీ అని పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రధాని మోదీ పాలనలో దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామన్నారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, గోవిందరాజులు, మల్లేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, ఉపేంద్రరెడ్డి, యుంగేంధర్, బాలు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



రాజోళిలో జెండా ఆవిష్కరణ చేస్తున్న బీజేపీ నాయకులు

ధన్యజీవి వాల్మీకి మహర్షి



గద్వాలటౌన్: వాల్మీకి మహర్షి జీవితం నేటి తరానికి అనుసరణీయమని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. గద్వాల మండలం తుర్కోనిపల్లి గ్రామంలో వాల్మీకి సంఘ నాయకులు ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజవంశీకులు డాక్టర్ సుహాసినిరెడ్డి, విక్రమ్‌సింహారెడ్డి హోమం చేశారు. భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేయడానికి వాల్మీకి రామాయణాన్ని రచించి ధన్యజీవిగా నిలిచారన్నారు. నిరక్షరాస్యులుగా ఉన్న వారందరినీ చదువుకునేలా వాల్మీకి బోయ సంఘాలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గీత, వెంకటపతి నాయుడు, మధుసూదన్‌బాబు, చిన్నపాడు అంజనేయులు, కోటేష్, గట్టు కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ఎర్రవల్లి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన దాత మెడికల్ రాము సహకారంతో గ్రామ పెద్దలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రవికుమార్, శివుడు, నాగేష్, రాముడు, శంకర్, రామచంద్రారెడ్డి, సాయిబాబ, అర్జున్ పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతు చేయండి సారూ

మానవపాడు: మండల కేంద్రం నుంచి చెన్నిపాడు- పెద్ద పోతులపాడు రహదారి మధ్యలో ఉన్న కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గత వర్షాకాలంలో కోతకు గురికావడంతో కల్వర్టు మీద ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.



మానవపాడు- చెన్నిపాడు మధ్యలో కోతకు గురైన కల్వర్టు

ఉచిత బియ్యంలో కేంద్రం వాటానే ఎక్కువ

గట్టు: పేదలకు ఉచిత బియ్యం పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటానే ఎక్కువగా ఉందని, కేంద్రం ఇచ్చే నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి అన్నారు. ఆదివారం ఇందువాసి గ్రామంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదలకు అందించే బియ్యం విషయంలో కేంద్ర ప్రభుత్వం రూ.40 చెల్లిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.10 మాత్రమే చెల్లించి, ఎక్కువ ప్రచారం చేసుకుంటున్నట్లు ఆరోపించారు. అన్ని రేషన్ దుకాణాల్లో ప్రధాని మోదీ ఫొటో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట్రాములు, బీజేవైం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, గట్టు మండల అధ్యక్షుడు నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



ఇందువాసిలో బియ్యం పంపిణీ చేస్తున్న స్నిగ్ధారెడ్డి

విజేతలకు బహుమతుల ప్రదానం

ధరూరు: మండల పరిధిలోని నీలహళ్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సందెరాళ్ల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి వామనపల్లి రవికి 5 తులాల వెండి కడియం, ద్వితీయ బహుమతి పారుచర్లకు చెందిన వ్యక్తికి 3 తులాల వెండి కడియం, తృతీయ బహుమతి మన్నాపురానికి చెందిన వ్యక్తి 2 తులాల కడియం, నాల్గవ బహుమతిగా ముగ్గురికి రూ.500 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో బహుమతుల దాత మీర్జాపురం రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రంగాస్వామి, మాజీ ఉప సర్పంచ్ రంగస్వామి, గోపాల్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రాంచంద్రారెడ్డి

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు

గట్టు: శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని గండి ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు ఎద్దుల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. పోటీల్లో సల్కాపురం ఎలుక మారెప్పకు చెందిన ఎద్దులు 700 అడుగుల దూరం లాగి మొదటి స్థానం, ద్వితీయ బహుమతి తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన నర్సింహులు ఎద్దులు, తృతీయ బహుమతి రాయాపురం నర్సింహులు ఎద్దులు, నాల్గవ బహుమతి గట్టుకు చెందిన తెలుగు ఆంజనేయులు ఎద్దులు దక్కించుకున్నాయి. ఎద్దుల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. అదే విధంగా సందెరాళ్ల పోటీలో మొదటి బహుమతి బల్గెర హనుమంతు 105 కేజీ చేతి రాయి ఎత్తి రూ.4016, ద్వితీయ బహుమతి యల్లందొడ్డి రామకృష్ణ రూ. 3016, తృతీయ బహుమతి యల్లందొడ్డి తిమ్మప్ప, బల్గెర నర్సింహులు సంయుక్తంగా 95 కేజీల చేతి రాయిని ఎత్తి రూ. 2016 దక్కించుకున్నారు. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

ఇటిక్యాల: మండల పరిధిలోని మునుగాలలో ఎద్దుల గిరక బండ్ల పోటీలో కుర్వ శ్రీరాములు ఎద్దులు ప్రథమ స్థానం, కుమ్మరి మద్దిలేటి ద్వితీయ, పత్తి రాముడు తృతీయ, మౌలాలి ఎద్దులు నాల్గవ స్థానాన్ని దక్కించుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నాయకులు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యాదమయ్య గౌడ్, బోయ రవి శాలువాలతో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో తెలుగు రాముడు, దస్తగిరి, నాగన్‌గౌడ్, బోయ మునెన్న, వడ్డె పెద్దమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో పోటీలో రాయి ఎత్తుతున్న యువకుడు

ప్రమాదమని తెలిసినా పట్టదా..?

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయని వైనం
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



జక్కిరెడ్డిపల్లిలో ప్రధాన రోడ్డు ప్రక్కన ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

శాంతినగర్: గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంలో విద్యుత్‌శాఖ అధికారులు అలసత్వం వహించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మండల పరిధిలో పది గ్రామ పంచాయతీల్లోని ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రక్షణ కంచెలు లేక తరచూ మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక చిన్నారులు ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన ఫీజులు, ఎర్త్‌వైర్లు తాకి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు.

మండల పరిధిలో ఇలా

వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లి గ్రామంలో నీటి ట్యాంకు సమీపంలో, జిల్లెడుదిన్నెలో రామాపురం రహదారి పక్కన, జూలెకల్ బీసీ కాలనీ, కొంకల ప్రధాన రహదారి పక్కన, బుడమర్సు, కోయిల్‌దిన్నె ఎస్సీ కాలనీ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ఏర్పాటు చేశారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఎర్త్ వైర్లకు నీరుపోయక

గృహ అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ వైర్లకు నీళ్లు పోయకపోవడంతో ఒక్కోసారి ఇళ్లల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో ప్రమాదాభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మృత్యువాత పడుతున్న గేదెలు



గ్రామం మధ్యలోని శనిగపల్లి రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలి. గతంలో విద్యుత్ వైర్లు తాకి గేదెలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

- గోపాల్, జక్కిరెడ్డిపల్లి, వడ్డేపల్లి

ఎర్త్ వైర్లు సరిచేయాలి



సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ సరిచేయాలి. ఎర్త్ సరిగా లేక చాలా గ్రామాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్త్ సరిగా లేక ఇళ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- రాఘవేంద్ర, జక్కిరెడ్డిపల్లి, వడ్డేపల్లి

ప్రతిపాదనలు పంపించాం

వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మరను గుర్తించాం. వాటి వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- సుబ్బారాయుడు, ఇన్‌చార్జ్ ఏఈ, శాంతినగర్